అంగన్‌వాడీలో వార్షికోత్సవం

వార్షికోత్సవంలో పాల్గొన్న అధికారులు, చిన్నారులు

రుద్రూర్/ మోర్తాడ్, ఏప్రిల్ 26 : రుద్రూర్‌మండలకేంద్రంతో పాటు రాయకూర్ తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్యువల్‌డేను శనివారం నిర్వహించారు. పౌష్టికాహారంతోపాటు విద్యనభ్యసిస్తున్న ఐదేండ్ల చిన్నారులను ప్రైమరీ పాఠశాలకు అర్హులుగా ప్రకటిస్తూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు సునంద, గంగామణి, పద్మ పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ గంగహంస ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు.

నీరడి లక్ష్మణ్‌కు డాక్టరేట్

డాక్టరేట్‌ను అందుకుంటున్న నీరడి లక్ష్మణ్

సారంగాపూర్, ఏప్రిల్ 26 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకుడు నీరడి లక్ష్మణ్ శనివారం డాక్టరేట్‌ను అందుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని హోసూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథుల చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. సామాజిక,రాజకీయ సేవా రంగాల్లో విశేష కృషిచేస్తున్నందుకు డాక్టరేట్‌ను అందజేశారు.

జీజీహెచ్ వద్ద వ్యక్తి మృతి

- **సంబంధీకులు సంప్రదించాలి : పోలీసులు**

వినాయక్‌నగర్, ఏప్రిల్ 26 :నగరంలోని జీజీహెచ్ ఆవరణలోని రేకులషెడ్డు వద్ద ఈ నెల 23న ఓ వ్యక్తి మృతిచెందాడని, సంబంధీకులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 50 ఏండ్ల వయస్సు ఉన్న వ్యక్తి కిందపడి మృతిచెందాడని, మృతుడి వద్ద ఆధార్‌కార్డు లభించగా అందులో ఆర్మూర్ మండలం మామిడిపల్లిచెందిన తెనాలి రవి అని ఉన్నదని, మృతుడి సంబంధీకులు 8712659714 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

మేకల లక్ష్మి

కోటగిరి, ఏప్రిల్ 26 : మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మి (54) ఆదృశ్యమైనట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. ఈనెల 17న ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త మేకల శివరాములు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఓరుగల్లుకు దండుగా కదలాలి

బీఆర్ఎస్ నాయకుల పిలుపు

బాల్కొండలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భీమ్‌గల్/ బోధన్/ ముప్కాల్/ బాల్కొండ/ మోర్తాడ్/ ధర్పల్లి/ కోటగిరి/ వర్ని, ఏప్రిల్ 26: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నేడు నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా నుంచి తరలివెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు శనివారం చెప్పారు.

భీమ్‌గల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు ఆర్మూర్ మహేశ్, చౌట్‌పల్లి రవితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సూచనల మేరకు మండలం నుంచి 14 బస్సుల్లో 700 మంది తరలివెళ్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం బస్సుల్లో బయల్దేరి వెళ్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు ఎంఏ మొయిజ్, మాజీ కౌన్సిలర్లు భగత్, బొదిరె నర్సయ్య, సతీశ్ గౌడ్, ప్రసాద్, మూత లింబాద్రి, పర్స నవీన్, తుమ్మ ముత్తెన్న, లింగం, రజాక్ పాల్గొన్నారు.

బోధన్ నుంచి ఐదు వందల మందితో తరలివెళ్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ సూచనల మేరకు పట్టణంలోని ఆచన్‌పల్లి నుంచి 40 వాహనాల్లో బయల్దేరి వెళ్తామన్నారు.

ఎల్కతుర్తి సభకు తరలివెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ముప్కాల్ సీనియర్ నాయకుడు కట్ట మహేశ్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

బాల్కొండ నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యతో తరలిరావాలని బీఆర్ఎస్ రూరల్ ఇన్‌చార్జి, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. సభకు ధర్పల్లి మండల కేంద్రం నుంచి తరలిరావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పీసు రాజ్‌పాల్‌రెడ్డి, నల్ల హన్మంత్‌రెడ్డి కోరారు.

బీఆర్ఎస్ సభకు తరలిరావాలని కోటగిరి బీఆర్ఎస్ నాయకులు మోరే కిషన్, సమీర్, సూదం నవీన్, దేవేందర్, ఫారూఖ్ పిలుపునిచ్చారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు కోటగిరి బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ చేసి, బహిరంగ సభకు బయల్దేరనున్నట్లు తెలిపారు.

తెలంగాణ అస్థిత్వ సభను జయప్రదం చేద్దాం

వినాయక్‌నగర్/ ఖలీల్‌వాడి, ఏప్రిల్ 26 : తెలంగాణ రాష్ట్ర అస్థిత్వ సభను విజయవంతం చేసేందుకు ప్రతి పౌరుడూ కదలి రావాలని భారాస లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ దాదన్నగారి మధుసుధన్ రావు ఒక ప్రకటనలో కోరారు. కేసీఆర్ చేసిన పదేండ్ల అభివృద్ధి.. కాంగ్రెస్ పార్టీ చేతిలో భస్మాసుర హస్తంలా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల చైతన్యాన్ని మరోమారు చూపించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని, సభకు అన్ని వర్గాల వారు తరలిరావాలని కోరారు.

కొడిచెర్లలో జెండా గద్దెకు ఏర్పాటు చేసిన కేసీఆర్, వేముల చిత్రపటాలు

జెండావిష్కరణలకు దిమ్మెలు సిద్ధం..

బాల్కొండ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే గ్రామాల్లో బీఆర్ఎస్ గద్దెలకు రంగులు వేయడం పూర్తి చేసుకోగా, మెండోరా మండలం కొడిచెర్ల గ్రామంలో బీఆర్ఎస్ గద్దెకు కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలను ఏర్పాటు చేశారు. వర్ని మండల కేంద్రంతో పాటు జాకోర, జలాల్‌పూర్, శంకోరా తండా తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ దిమ్మెలకు గులాబీ రంగు వేశారు.

బావిలో పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 26 : మండలకేంద్రంలోని గ్రామపెద్ద చెరువు వద్ద ఉన్న బావిలో జక్రాన్‌పల్లికి చెందిన మాడవేరి ముత్యం (50) ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యం మద్యానికి బానిసై రోజూ తాగేవాడు. మద్యం మత్తులో బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి ఇంకా పెండ్లి కాలేదని, మృతుడి అన్న శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **ఉచిత పేరిణి నాట్య శిక్షణ శిబిరం -** సుభాష్‌నగర్, ఏప్రిల్ 26 : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, భీమన్ నృత్యనికేతన్ ఆధ్వర్యంలో ఉచిత పేరిణి నాట్యం వేసవిశిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పేరిణి నాట్యాచార్యుడు రాజేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 2 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న వారు 9393994141 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.
- **తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ టాలెంట్ కోఆర్డినేటర్‌గా గోపాలకృష్ణ** – ఖలీల్‌వాడి, ఏప్రిల్ 26 : తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జిల్లా కోఆర్డినేటర్‌గా రాఘవాపురం గోపాలకృష్ణను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, టాలెంట్ సెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ చింతపట్ల వెంకటాచారి నియమించారు. రాఘవాపురం గోపాలకృష్ణ కంజర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. జిల్లాలో కూడా అర్హులకు అవార్డు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.
- **ఇందిరమ్మ ఇండ్ల పనుల పరిశీలన -** డిచ్‌పల్లి, ఏప్రిల్ 26 : మండలంలోని కమలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను ఎంపీడీవో భూక్యా లింగంనాయక్ శనివారం పరిశీలించారు. కమలాపూర్ గ్రామానికి వంద ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, వాటిలో ఇప్పటివరకు 29 గ్రౌండింగ్ పనులు పూర్తయ్యాయని, 5 బెస్మెంట్ లెవల్ పనులు పూర్తయ్యాయని మిగిలిన 71 ఇండ్లు త్వరలో పనులు తెలిపారు. అనంతరం నర్సింగ్‌పూర్, రాంపూర్ గ్రామాల్లోని ఉపాధి హామీ పనులను పరిశీలించారు.
- **అడిగిన వారందరికీ 'ఉపాధి' పనులు కల్పించాలి -** డిచ్‌పల్లి, ఏప్రిల్ 26 : అడిగిన వారందరికీ జాబ్‌కార్డులు అందజేసి, ఉపాధి హామీ పనులు కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలతో మాట్లాడారు. కూలీలకు నీడ, నీటి వసతి, మెడికల్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పనిప్రదేశంలో లేవన్నారు. ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించి రూ. 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్పల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీల వద్దకు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ భీమ్‌గల్ సబ్‌డివిజన్ కార్యదర్శి బాలయ్య వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.
- **అందాల పోటీల నిర్వహణ స్త్రీల ఆత్మాభిమానం దెబ్బతీయడమే -** సిరికొండ, ఏప్రిల్ 26 : అందాల పోటీల నిర్వహణ స్త్రీల ఆత్మాభిమానం దెబ్బతీయడమే అని పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి అన్నారు. అందాల పోటీలకు నిరసనగా సిరికొండ, ధర్పల్లి, కమ్మర్‌పల్లి నుంచి పీవోడబ్ల్యూ నాయకురాళ్లు శనివారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు.
- **ఆర్థిక సాయం అందజేత -** ఇందల్వాయి, ఏప్రిల్ 26 : డిచ్‌పల్లి మండలం ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో మంగళి రాజన్న ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి గల్ఫ్ చేయూత సంఘం సభ్యులు శనివారం రూ.6,500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జలగడుగుల అశోక్, కాలూరి మురళి, నర్సయ్య, సురేందర్, భూమన్న పాల్గొన్నారు.
- **విద్యుత్‌షాక్‌తో గేదె మృతి-** రుద్రూర్, ఏప్రిల్ 26 : మండలంలోని రాణంపల్లి శివారులో విద్యుత్ షాక్‌తో శనివారం గేదె మృతిచెందింది. బోయి శంకర్ గేదెలను రాణంపల్లి శివారులో మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న వైర్లకు తగిలి ఓ గేదె అక్కడికక్కడే మృతిచెందింది. పశువుల కాపరులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

60 సెల్‌ఫోన్ల రికవరీ

బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగించిన పోలీసు అధికారులు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 26 : జిల్లాకేంద్రంతోపాటు ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించారు. రికవరీ చేసిన 60 సెల్‌ఫోన్లను అదనపు పోలీస్ కమిషనర్ (సీఎస్‌బీ) ఎస్.శ్రీనివాస్‌రావు బాధితులకు శనివారం అందజేశారు. రివకరీకి కృషిచేసిన మహిళా కానిస్టేబుల్ డి.అనూష (1టౌన్), ఆర్.సుష్మ (ఐటీ సెల్)ను అభినందించారు. పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి ఏసీపీ మస్తాన్ అలీ, ఐటీ కోర్ ఆర్ఎస్సై నిషిత్ పాల్గొన్నారు.

ఇందూరులో వర్షం

- **చల్లబడ్డ వాతావరణం**

ఖిల్లీల్‌వాడి/ మోస్రా (చందూర్), ఏప్రిల్ 26 : జిల్లాలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కొన్ని రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతల వేడిమితో అల్లాడిన జిల్లా ప్రజలు ఉపశమనం పొందారు. పలు చోట్ల ధాన్యం ఆరబెట్టిన రైతులు వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోస్రా మండల కేంద్రంలో మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులు వాటిని కాపాడుకునేందుకు తిప్పలు పడ్డారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- **3 తులాల బంగారం, రూ.50 వేలు నగదు అపహరణ**

వినాయక్‌నగర్, ఏప్రిల్ 26 : నిజామాబాద్ నగరంలోని పూలాంగ్ బ్రిడ్జి ప్రాంతంలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి, బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నయ్య మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ఇంటి తాళం పగులగొట్టి, బీరువాలోని మూడు తులాల బంగారు నగలు, రూ.50 వేలు నగదు ఎత్తుకెళ్లారు. వస్తువుల చప్పుడు కావడంతో పక్క ఇంట్లో నిద్రిస్తున్న చిన్నయ్య కుమారుడు మేల్కొని బయటికి వచ్చి చూడగా దుండగులు అప్పటికే బైక్‌పై పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు నగర సీఐ శ్రీనివాస్‌రాజ్, ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

దారిదోపిడీ, హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

- **రిమాండ్‌కు తరలింపు**
- **రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నం..**
- **వివరాలు వెల్లడించిన డిచ్‌పల్లి సీఐ మల్లేశ్**

వివరాలు వెల్లడిస్తున్న డిచ్‌పల్లి సీఐ మల్లేశ్

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 26 : దారి దోపిడీతో పాటు హత్య చేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించిన ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బైరం రవీంద్రవర్మ (37) సికింద్రాపూర్ గ్రామశివారులో జాతీయరహదారి పక్కన ఈనెల 3న రాత్రి అనుమానాస్పదస్థితిలో జక్రాన్‌పల్లి పోలీసులకు కనిపించాడు. అతడిని పోలీసులు ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్సపొందుతూ తర్వాతి రోజు మృతిచెందాడు. ముందుగా గుర్తుతెలియని వాహనం ఢీకొని చనిపోయి ఉంటాడని ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో మృతుడి ఫోన్, బ్యాగ్ లభించకపోవడంతో మొబైల్ ఫోన్ ఆధారంగా విచారణ చేపట్టి, నిందితులు జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన లక్ష్మీనర్సింహులు (ఏ1), చింతల కృష్ణ (ఏ2), కామారెడ్డికి చెందిన కడమంచి మారుతి (ఏ3)ని పట్టుకొని, విచారణ చేపట్టారు. ఈనెల 3న రాత్రి సుమారు 10.30 గంటలకు ఆర్మూర్ వైపు వెళ్లి మామిడిపల్లి జంక్షన్ వద్ద ఉన్న వైన్స్ దగ్గర మద్యం తాగి, చేతిలో స్మార్ట్‌ఫోన్, బ్యాగ్‌తో ఉన్న రవీంద్రవర్మను ముగ్గురు నిందితులు లిఫ్ట్ ఇస్తామని వారి బండిపై ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లిన తర్వాత సికింద్రాపూర్ గ్రామశివారులో బైక్ ఆపి, రవీంద్రవర్మని బెదిరించి ఫోన్, బ్యాగ్, డబ్బులు లాకున్నారు. రవీంద్రవర్మ వారికి ఎదురుతిరగడంతో బండరాయితో తలపై కొట్టగా అతను స్పృహ కోల్పోయి కిందపడ్డాడు. చనిపోయాడని భావించి, ఎవరికీ అనుమానం రాకుండా జాతీయ రహదారి పక్కనే పడేసి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు చిత్రీకరించే యత్నం చేశారు. నిందితులు ముగ్గురు బంధువులని, వీరిపై కామారెడ్డి, దేవున్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు.

మూఢ నమ్మకాలను విశ్వసించవద్దు

- **జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ**

నందిపేట్, ఏప్రిల్ 26: ప్రజలు అనారోగ్యం బారిన పడితే దవాఖానకు వెళ్లి చికిత్స చేసుకోవాలని, మూఢ నమ్మకాలను విశ్వసించవద్దని జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ సూచించారు. మండలంలోని బజార్‌కొత్తూర్‌కు చెందిన ఏడు నెలల బాబు కొమురం గణేశ్, చౌడమ్మ కొండూర్‌కు చెందిన నాలుగు నెలల చిన్నారి నవ్యశ్రీ ఈనెల 18న మృతిచెందారని చెప్పారు. వారి మృతికి న్యుమోనియా కారణమని వార్తలు వచ్చాయని తెలిపారు. కానీ గణేశ్ జ్వరంతో బాధపడుతూ మృతిచెందాడని, నవ్యశ్రీ బ్రాంకీ న్యుమోనియాతో మృతిచెందినట్లు తమ సిబ్బంది చేపట్టిన విచారణలో తేలిందన్నారు. ప్రజలు భూత, నాటు వైద్యాలకు దూరంగా ఉండాలని, అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

మేడే పోస్టర్ల ఆవిష్కరణ

నందిపేట్/ మోర్తాడ్, ఏప్రిల్ 26: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా మేడే పోస్టర్లను మండల కేంద్రంతోపాటు సీహెచ్ కొండూర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూసీఐ నందిపేట్ మండల ప్రధాన కార్యదర్శి సాయారెడ్డి మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను విలుపుదల చేయాలని కోరుతూ మేడేను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు హరిదాసు, విఠల్, బాలు, లక్ష్మి, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు. మోర్తాడ్‌లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా నాయకురాలు జమున, ప్రగతిశీల వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నక్క, నర్సయ్య, రాజేశ్వర్, దుర్గయ్య, సువర్ణ, లత, గంగాధర్, మజీద్, భాజన్న, గంగు, ముత్తెన్న, దేవన్న, సురేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్బన్ పార్క్‌ను వినియోగంలోకి తేవాలి

భీమ్‌గల్, ఏప్రిల్ 26:భీమ్‌గల్ పట్టణంలోని అర్బన్‌పార్క్‌ను వినియోగంలోకి తేవాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని పాత అంగడిబజార్‌లో ఉన్న మున్సిపల్ అర్బన్ పార్క్‌ను సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం డీఆర్‌సీ కేంద్రాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మాక్లూర్, ఏప్రిల్ 26: మండలంలోని దాస్‌నగర్‌లో ఉన్న ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈ విద్యార్థినులు ఇంటర్‌లో ప్రతిభ చాటారు. దీంతో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహేశ్వరి, శృతిక, విఘ్నేశ్వరి ప్రశంసా పత్రాలతోపాటు రూ.పది వేల నగదు పురస్కారాన్ని అందుకున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ధాత్రిక వెంకటేశ్వర్ రావు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాల మాయదేవి, కార్యదర్శి సైదులు అందజేశారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

నవీపేట, ఏప్రిల్ 26: స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధ్యమని డీపీఎం రాచయ్య అన్నారు. యంచలో ఎస్సీఐ రీసెట్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఫ్యాకల్టీ రామకృష్ణ, నవీన్, బాల స్వామి, శరత్, స్రవంతి, ఐకేపీ సీసీ గంగారాం, సీఏ సరిత పాల్గొన్నారు.

దుబాయ్‌లో నర్సాపూర్ వాసి మృతి

రమేశ్ (ఫైల్)

మోర్తాడ్, ఏప్రిల్ 26: కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన గుపెల్లి రమేశ్(50) ఈనెల 24న దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరుకుంటుందని బంధువులు తెలిపారు. అతడు 24న విధుల్లో ఉండగానే గుండెపోటు వచ్చిందన్నారు. కంపెనీ వారు మృతదేహాన్ని స్వగ్రామానికి పంపే ఏర్పాట్లు చేశారని చెప్పారు. అతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారని తెలిపారు.

ఆధార్ తరహాలో భూకమతాలకు భూధార్

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మాక్లూర్/ ఆర్మూర్ టౌన్/ నందిపేట్, ఏప్రిల్ 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి (ఆర్వోఆర్ 2025) చట్టం ద్వారా వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భూకమతాలకు భూధార్ నంబర్లను కేటాయిస్తున్నదని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. నిర్దిష్ట గడువులోపు భూసమస్యలు పరిష్కారమయ్యేందుకు ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మాక్లూర్, నందిపేట్, ఆర్మూర్ మండల కేంద్రాల్లో శనివారం భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూభారతి చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలంలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాటిని తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా పరిష్కరిస్తారని తెలిపారు. మే, జూన్ నెలల్లో గ్రామాల వారీగా అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలున్న రైతుల నుంచి ఆర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. భూభారతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆ ఆర్జీలు 60 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తారన్నారు. గతంలో రికార్డులు చూసి రిజిస్ట్రేషన్లు చేసేవారని, కొత్త ఆర్వోఆర్ చట్టంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర విచారణ అనంతరం రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న రికార్డులు ఆధునీకరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. సదస్సుల్లో ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్, మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్ చైర్మన్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో వీడియోలు చూసి

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

వివరాలు వెల్లడిస్తున్న నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్

నవీపేట, ఏప్రిల్ 26: చోరీ చేయడం ఎలా అనే విషయాన్ని షేర్ చాట్‌లో చూసిన ముగ్గురు కూలీలు ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేశారు. పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్ నవీపేటలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మోపాల్ మండలం కంజరకు చెందిన కాలూర్ లత, పంతుల విజయ, ఈర్ల సాయికుమార్ కూలీ పనిచేస్త